www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 10 సెప్టెంబర్ 2025



వైఎస్ఆర్

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కనగరంలో రోడ్లపై, ఇళ్లసమీపంలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ మనోజ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన నగరంలో పర్యటించారు. మార్నింగ్ విజిట్‌లో భాగంగా సౌత్ జోన్‌ను పరిశీలించారు. 19వ డివిజన్‌లో శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. ప్రతీ ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా?, మురుగు కాలువల్లో పూడికలను సకాలంలో తొలిగిస్తున్నారా లేదా అని సంబంధిత శానిటరి కార్యదర్శిని, ఇన్‌స్పెక్టర్‌ను ఆరాతీశారు. 19 వ డివిజన్‌లో జరిగే ఆరోగ్యమాత తిరుణాలలో వెలువడిన చెత్తను సకాలంలో తొలిగించాలని సిబ్బందిని ఆదేశించారు. పాత బస్టాండ్ లో ఉన్న అన్న క్యాంటీన్ ను ఆకస్మిత తనిఖీ చేశారు. ప్రజలకు అందించే భోజన నాణ్యత ను, అక్కడ పని చేసే సిబ్బంది పని తీరుని గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.



వ్య.కా.స జెండాను ఆవిష్కరిస్తున్న జాతీయ అధ్యక్షులు కె. విజయరాఘవన్



అమరులకు నివాళులర్పిస్తూ మౌనం పాటిస్తున్న జాతీయ నాయకులు

కడపలో మూడ్రోజులపాటు నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో భాగంగా రెండవ రోజైన మంగళవారం హరిత హోటల్ ప్రాంగణంలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను జాతీయ అధ్యక్షులు కె.విజయరాఘవన్ ఆవిష్కరించారు. అనంతరం సెమినార్ హాలుల్లో సిపిఎం అగ్రనేతలు పుచ్చపల్లి సుందరయ్య, వి.ఎస్.అచ్యుతానందన్, సీతారాం ఏచూరి చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం దేశంలో అమరులైన ప్రజా సంఘాల నాయకులకు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, రైతు సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి విజూకృష్ణన్, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం కన్వీనర్ లలితాబాలన్, కేరళ వ్యవసాయ కార్మిక సంక్షేమ సంఘం బోర్డ్ చైర్మన్ చంద్రన్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాలసుబ్బారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, మహిళా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కన్వీనర్ శివ నాగరాణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామనూరు శ్రీనివాసులరెడ్డి, మనోహర్, సిఐటియు జిల్లా కార్యదర్శి రామ్మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, ఇతర డెలిగేట్ సభ్యులు, స్థానిక నాయకులు డి.దస్తగిరిరెడ్డి, శివకుమార్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రధాన వార్త మెయిన్‌లో

జిల్లాలో యూరియా కొరత లేదు : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రణాళికా బద్ధంగా పంపిణీ కార్యక్రమం సాగుతోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టర్‌లోని విసి హాలులో జిల్లాలో యూరియా నిల్వలు, పంపిణీపై ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ అవసరాల నిమిత్తం ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను అక్రమంగా విక్రయించడం లేదా ఇతర అవసరాలకు మళ్లించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు ఈసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో లక్షా ఎకరాల్లో వారి సాగుబడి ప్రణాళికను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశామని తెలిపారు. ప్రధానంగా కెసి ఆయకట్టు పరిధిలో 45 వేల ఎకరాల్లో వరి పంట విస్తారంగా సాగులో ఉందని, మరో నెల రోజుల్లో సాగు విస్తృతి 80 వేల ఎకరాలకు పెరగనుందని చెప్పారు. ఈ ఏడాది 3 వారాల ముందే సరిపడా వర్షపాతం నమోదు కావడంతో కెసి బ్రహ్మంసాగర్ ఆయకట్టులో రైతులు ఉత్సాహంగా వరి పంటను సాగు చేస్తున్నారన్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటికే 12,800 మెట్రిక్ టన్నుల యూరియాను ఆయా ప్రాంతాల రైతు సేవ కేంద్రాలు, సంబంధిత డీలర్ల ద్వారా అందించామన్నారు. మరో వారంలో 50 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి రానుందని చెప్పారు. జిల్లా రైతాంగానికి సరిపడా యూరియాను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. శాస్త్రీయ పరంగా రైతులు ఒక ఎకరాకు ఒకటి లేదా ఒకటిన్నర బస్తాను మాత్రమే మూడు విడతలుగా వాడాల్సివుందని తెలిపారు. అధిక మోతాదులో యూరియాను వినియోగించడం వల్ల అనేక అనర్థాలు ఎదురయ్యే అవకాశాలున్నాయన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు 2-3 బస్తాలు వినియోగించారని , మరి కొందరు అవసరానికి మించి యూరియాను కొనుగోలు చేసి నిల్వ ఉంచుకుని కృత్రిమ కొరత సృష్టించవద్దని సూచించారు. మూడు రోజులుగా 1300 మెట్రిక్ టన్నుల ఎరువులను అందజేశామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

యూరియా అనేది కేవలం నత్రజనిని మాత్రమేనిచ్చే కంపోనెంట్ అని యూరియాని సమతుల్య స్థాయిలోనే వాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. జిల్లాలో యూరియా, సంబంధిత ఎరువులకు ఎలాంటి కొరత లేదన్నారు. ప్రస్తుతం చీనీ పంట చివరి దశలో ఉందన్నారు. చీనీ పంట మార్కెటింగ్ విషయంలో రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. రైతులు గ్రేడింగ్ మంచిగా చేసి యాక్షన్ చేస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ తోపాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఎస్‌పి అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో యూరియా సరఫరాకు సంబంధించి పోలీసు శాఖ ప్రత్యేక సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా ఎరువులు, విత్తనాల పంపిణీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. ఎరువుల పంపిణీ సమయంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం నుండి అన్ని రకాల భద్రతా చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో జెసి అదితిసింగ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రా నాయక్, ఎపి మార్క్ ఫెడ్ డిఎం పరిమళ జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలంటూ కార్మికుల ధర్నా


రెండు రోజుల్లో బ్యాంక్ ఖాతాల ద్వారా కార్మికులందరికీ జీతాలు : డిపిఒ రాజ్యలక్ష్మి



విధుల్లో చేరాలని కార్మికులను కోరుతున్న డిపిఒ

ప్రజాశక్తి - వేంపల్లె

తమకు జీతాలు చెల్లించాలంటూ పారిశుధ్య కార్మికులు మంగళ వారం పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జీతాలు ఇవ్వని పక్షంలో విధులకు దూరంగా ఉంటామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, పులివెందుల సమన్వయకర్త ధృవ కుమార్‌రెడ్డి, వైసిపి నేత సాదక్‌వలి సంఘీభావం తెలిపారు. రెండు రోజు లుగా పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో పారిశుధ్యం వేంపల్లెలో చాలా అధ్వానంగా తయారైంది. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పం చాయతీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టడంతో.. మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి వేంపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కార్మికులు కార్యాలయం వద్దకు చేరు కుని జీతాలు చెల్లించాలంటూ డిపిఒ ఎదుట ధర్నా చేపట్టి, జీతాలు చెల్లించే వరకు విధులకు హాజరుకామని నినాదాలు చేశారు. డిపిఒతోపాటు డిఎల ్పిఒ రమాదేవి, ఇఒపిఆర్డి రామమోహన్‌రెడ్డి నచ్చజెప్పినా కార్మికులు మాత్రం జీతాలు ఇచ్చే వరకూ వెళ్లేదిలేదని భీష్మించుకుని కూర్చున్నారు. డిపిఒతో తులసిరెడ్డి, పులివెందుల సమన్వయకర్త ధృవకుమార్‌రెడ్డి, వైసిపి నేత సాదక్ వలి, టిడిపి నేత మహమ్మద్ షబ్బీర్, యాసిన్, తక్కెల షరీఫ్ దాదాపు రెండు గంటల వరకు చర్చించారు. అనంతరం నాయకుల విన్నపం మేరకు రెండు రోజుల్లోగా కార్మికుల జీతాలను వారి బ్యాంకు ఆకౌంట్ లో వేయాలని డిఎల్‌పిఒ రమాదేవికి డిపిఒ ఆదేశించారు. రెండు రోజుల్లో కార్మికులందరికీ జీతాలు ఇవ్వకపోతే కడపలోని డిపిఒ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయా పార్టీల నాయకులు చెప్పడంతో కార్మికులు సమ్మెను విరమించుకునేందుకు ఒప్పుకున్నారు. ముందుగా విధుల్లో చేరాలని డిపిఒ కోరగా కొందరికైనా ఆన్‌లైన్‌లో జీతాలు పడే వరకు విధులకు హజరు కాలేమని నాయకులకు, అధికారులకు కార్మికులు చెప్పారు. ప్రతి కార్మికునికీ బ్యాంక్ ఖాతా ద్వారా జీతాలు చెల్లిస్తామని డిపిఒ రాజ్యలక్ష్మి తెలిపారు. డిఎల్‌పిఒ రమాదేవికు చెక్ పవర్ ఇచ్చారు. కార్మికుల వేతనాలు నుండి కటింగ్ చేసిన 15 నెలల పిఎఫ్, ఎల్ఐసి డబ్బులు, ఈఎస్ఐ డబ్బులు వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. రెగ్యులర్ ఇఒను త్వరలో నియమిస్తామన్నారు.



రంతుకు కేక్ తినిపిస్తున్న టిడిపి మండల నాయకులు

కార్పొరేషన్ డైరెక్టర్ రంతుకు సన్మానం

ప్రజాశక్తి-కాశినాయన

ఆర్ అండ్‌బి రూరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సాధనకారి రంతును టిడిపి అధ్యక్షులు భైరవ ప్రసాద్ మండల, ఉపాధ్యక్షుడు తుపాకుల ప్రసాద్ మంగళవారం శుభాకాంక్షలు తెలియజేస్తూ శాలువతో పూలమాలతో సన్మానించారు అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి నిరంతరం కృషి చేస్తూ ఉన్నందునే పార్టీ అధిష్టానం గుర్తించి మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆధ్వర్యంలో పదవిని రంతుకు కట్టబెట్టిందని చెప్పారు. కార్యక్రమంలో కార్యకర్తలు. నాయకులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈనెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూరి డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622 లలో కానీ ఫోన్ ద్వారా కానీ లేదా kadapa.dcourts.gov.in ద్వారా సంప్రదించవచ్చునని వారు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - బద్వేలు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొనా్రను. పట్టణంలోని గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బందితో బద్వేల్ మున్సిపల్ కమిషనర్ నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ ఫ్రైడే డ్రై డే పక్కగా నిర్వహించడంతో పాటు ఆరోగ్య కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పురపాలక పరిధిలో గాంధీనగర్, కోటవీధి, గుంతపల్లెలో పట్టణ ఆరోగ్య కేంద్రాలు, తొట్టిగారిపల్లి ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలున్నాయని, వాటి సేవలు వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, ఆధార్ కు లింకు అయిన మొబైల్ తప్పక తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా కల్పించే సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ సౌమ్య, హెల్త్ సూపర్ వైజర్లు శివరాంరెడ్డి, హెల్త్ సెక్రెటరీ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌చంద్ర

ఉద్రిక్తతల నడుమ అన్నదాత పోరు

- ర్యాలీని అడ్డుకున్న పోలీసులు
- రెవెన్యూ అధికారులకు వినతి పత్రాల సమర్పణ
- రైతులకు వైసిపి అండ
- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా



జమ్మలమడుగులో వైసిపి ఎమ్మెల్సీని అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో మంగళవారం వైసిపి ఆధ్వర్యంలో రైతు సమస్యలపై చేపట్టిన అన్నదాత పోరు ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. ఇందులో భాగంగా నిర్వహించినర్యాలీని, ఆందోళనను పోలీసులు అడ్డుకున్నారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందులలో వైసిపి కార్యాలయం నుంచి రెవెన్యూ కార్యాలయాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయా కార్యాలయ ఆర్‌డిఒలకు వినతి పత్రాలు సమర్పించారు.

కూటమి ప్రభుత్వ పాలనలో ఎరువులను బ్లాక్ చేసి రూ. 250 నుంచి రూ. 300 కోట్ల మేరకు వసూలు చేస్తున్నారని, రైతులకు వైసిపి ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో మంగళవారం కడప నగరంలో ఎరువుల బ్లాక్ మార్కెట్.. అన్నదాత పోరు నిరసన ర్యాలీ వైసిపి కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి కడప ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రంలో యూరియా, ఎరువుల కోసం రైతులు గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ప్రభుత్వం మొద్దునిద్రపోతోందని వాపోయారు. సమస్యలను రైతులతో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌డిఒలకు వినతిపత్రాలిచ్చే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన ఎరువుల్లో అధికభాగం ప్రయివేట్‌కు మళ్లించడం వల్లే ఈ సమస్య వచ్చిందని అచ్చెన్నాయుడే స్వయంగా చెప్పారని అన్నారు. ప్రయివేట్‌కు ఇచ్చిన యూరియాను బ్లాక్ చేసి, బస్తా రూ.270 ఉంటే, దాన్ని రూ.450-600కు అమ్ముతున్నారు అన్నారు. మరోవైపు పంటలకు గిట్టుబాటు ధరలులేక రైతులు లబోదిబో మంటున్నారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉన్నా చంద్రబాబులో కనీస చలనం లేదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులను వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు **కమలాపురం టౌన్ :** వైసిపి ఆధ్వర్యంలో అన్నదాత పోరులో భాగంగా నిర్వహించే ర్యాలీకి పోలీసులు వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాధరెడ్డిని, నియోజకవర్గ నాయకులు రామాంజులను అడ్డుకుని పార్టీ కార్యాలయానికి తరలించారు. ససేమిరా అంటూ ఉద్రిక్తతల మధ్య ర్యాలీ నిర్వహించారు. **ప్రొద్దుటూరు :**రైతులను గాలికి వదిలేసిన ఈ దుర్మార్గపు పాలనలో రైతుల ప్రయోజనం కోసం వైసిపి కార్యకర్తలు, నాయకులు బలిదానానికైనా సిద్ధమే అని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచముల ప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం అన్నదాత పోరు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి మార్కెట్ యార్డు లోని వ్యవసాయ శాఖ ఏడి కార్యాలయం వరకు చేరుకుని ఏడీ అనితకు వినతిపత్రం సమర్పించారు. **పులివెందుల టౌన్ :** కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు తప్పడంలేదని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌వి సతీష్‌కుమార్ రెడ్డి, మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీగా నిర్వహించారు. అనంతరం కార్యాలయానికి వెళ్లేందేకు వైసిపి నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డుపై బైఠాయించారు. చివరగా కార్యాలయంలో ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సింహాద్రిపురం మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, నాయకులు బలరాంరెడ్డి, చంద్రబాబురెడ్డి, సర్వోత్తమ్‌రెడ్డి, సారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, బాబురెడ్డి, పద్మనాభరెడ్డి, నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు రామసుబ్బారెడ్డి స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముందుగా పోలీసులు పోలీస్‌స్టేషన్, బాలాజీ హైస్కూల్ వద్ద ర్యాలీని అడ్డుకున్నారు. వైసిపి ఆధ్వర్యంలో రైతులు కదం తొక్కారు. పోలీసుల వ్యవహార శైలికి ఒకింత అసహనానికి గురయ్యారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని పోలీసులు పోలీస్‌స్టేషన్ వద్ద అడ్డుకొని ర్యాలీ ద్వారా కాకుండా వాహనంలో ఎక్కించుకొని ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దింపారు. అనంతరం కార్యాలయంలోని ఎఒ అక్బాల్‌బాషాకు ఎమ్మెల్సీ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, పార్టీ జిల్లా మున్సిపల్ విభాగం అధ్యక్షులు వల్లంబాయి రిషికేశవరెడ్డి, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి యాదవ్, చిన్నకొమెర్ల జగదీశ్‌రెడ్డి, ఉప్పలపాడు వెంకటేశు, పెద్దముడియం మండల అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, నవాబుపేట రవీంద్రారెడ్డి, అన్నపురెడ్డి రాణి, గూడెంచెరువు నాగేశ్వరరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, భారీ ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

మూడు పార్టీలు బిజెపికి తొత్తులే

ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఉభయ పార్లమెంటు సభల్లోని 36 మంది సభ్యులు ఎన్‌డిఎ కూటమికి చెందిన అభ్యర్థికి మద్దతుగా ఓటింగ్ వేశారని, గల్లీలో సై.. రాష్ట్రంలో నై..ఢిల్లీలో భాయ్ రాష్ట్ర విభజన నుంచి రాష్ట్రం లోని టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు వ్యవహరిస్తున్నాయని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ విమర్శించారు. మంగళవారం భారతీయ జనతా పార్టీ ప్రధాన భాగస్వామ్య పక్షంగా ఉన్న ఎడిఎ కూటమిలో 2014 ఎన్నికల్లో టిడిపి, జనసేన పార్టీలు పొత్తుతో కలిసి పోటీ చేయగా, వైసిపిని ఒంటరిగా పోటీ చేసిందని పేర్కొన్నారు. అప్పుడు కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి అధికారంలో రావడంతో కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడగా, చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ ఏర్పడిందని తెలిపారు. అప్పటి నుంచి మొదలైన గల్లీలో సై, రాష్ట్రంలో నై, ఢిల్లీలో భాయ్ బంధం ఇప్పటివరకు కొనసాగుతూనే ఉందని చెప్పారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఉభయ పార్లమెంటు సభ్యులు 36 మంది మద్దతు ఇస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు తప్ప ఈ 11 సంవత్సరాలలో ఎన్‌డిఎ ప్రతిపాదించిన ప్రతి బిల్లుకూ బేషరతుగా వైసిపి మద్దతు ఇస్తున్నాయన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలో ఉన్నంత కాలం వీరి పంథాలో ఎటువంటి మార్పు ఉండదన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సలావుద్దీన్

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను రైతులు విధిగా వేయించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి అక్టోబర్ 15 వరకు టీకాల కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 3,71,400 డోసుల టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 4 నెలలు వయస్సు దాటిన నల్ల, తెల్ల పశువు కలిగియున్న రైతు ఈ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జెడి శారదమ్మ, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన సయ్యద్ నూర్‌ను ఎంపియుపి ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, ఎస్ఎంసి. కమిటీ చైర్మన్ ఎస్.ఖాదర్ బాషా, పాఠశాల ఉపాధ్యాయులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రభుత్వం అవార్డు ఇవ్వడం హర్షనియమని చెప్పారు. పాఠశాల సమస్యలు పరిష్కరిస్తానని, పెండింగ్ పనులు, చెట్లు నాటడంలో భాగస్వాముడిని అవుతానని పేర్కొన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి కొరకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

కడిగిన ముత్యం చంద్రబాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి చంద్రబాబును గత వైసిపి ప్రభుత్వం అక్రమ అరెస్టు చేసి ఇప్పటికి రెండేళ్లు అయిందని, అన్ని రోజులు జైల్లో పెట్టిన కడిగిన ముత్యంలా బయటికి వచ్చి ప్రజల ఆదరణ పొందారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్‌పల్లె లక్ష్మీ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 2023, సెప్టెంబర్ 9న తమ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాక్షసానందం పొందాడన్నారు. అరెస్టు చేసి 53 రోజులు జైల్లో ఉంచినా ఒక్క ఆరోపణను రుజువు చేయలేకపోయారన్నారు. ఎప్పుడు ప్రజల బాగోగులు గురించి అహర్నిశలు కష్టపడిన విజన్ ఉన్న నాయకుడు అని అన్నారు. ఎన్నికలకు ముందు ఆయనను అరెస్టు చేసి లోపల పెట్టి మళ్లీ అధికారంలోకి రావాలన్న జగన్ ఆలోచనను ప్రజలు తిప్పి కొట్టారన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా ముందుకెళుతున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా కళాకారుల సంఘం నాయకులు

కళాకారుల సంక్షేమ సంఘం ఏర్పాటు

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప జిల్లా కళాకారుల సంక్షేమమే ధ్యేయంగా కడప కళాకారుల సంక్షేమ సంఘం మంగళవారం ఏర్పాటు అయ్యింది. గౌరవ అధ్యక్షులుగా సీనియర్ డ్రామా ఆర్టిస్ట్ ఎం.చెన్నయ్య, జిల్లా కన్వీనర్‌గా మహమ్మద్ రఫీ గాత్రధారి సీనియర్ గాయకుడు ఎస్.ఏ.కలామ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కళాకారుల సమస్యల పరిష్కారం కోసమే ఈ సంఘం పని చేస్తుందన్నారు. కడప జిల్లాలోని కళాకారులను తమ సంఘంలో సభ్యులుగా చేరి సహకరించాలని సాదరంగా ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలిగిన కళాకారులు స్థానిక కళాక్షేత్రం, మహిళా పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న డ్రామా ఆర్టిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం 11 గంటలకు జరిగే సమావేశంలో పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. సమావేశంలో సీనియర్ గాయకులు నయీమ్,అరీఫ్ పాల్గొన్నారు.

డెంగీ బాధిత కుటుంబాలకు పరామర్శ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆలంకానపల్లి, తిలక్‌నగర్‌లో డెంగీ జ్వరంతో బాధపడుచున్న కుటుంబాలను కడప జోనల్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. జ్వరంతో బాధపడుతున్న వారి ఆరోగ్యం గురించి వాకబు చేశారు. తరువాత గ్రామంలో వైద్య సిబ్బంది చేస్తున్న లార్వా సర్వే, ఫీవర్ సర్వే పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు ఇచ్చారు. ప్రజలకు మలేరియా, డెంగీ జ్వరాలు గురించి అవగాహనా కార్యక్రమం చేపట్టారు.రోజు గ్రామంలో పర్యటించి జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి వైద్య సదుపాయం కల్పించాలని చెప్పారు. తరువాత ఆలంకానపల్లి యుపిహెచ్‌సిని తనిఖీ చేశారు. ల్యాబ్, డెలివరీల గురించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ రిభిత, మెడికల్ ఆఫీసర్, నిత్యపూజయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి, నాగలక్ష్మి, సబ్ యూనిట్ అధికారి, జోనల్ మలేరియ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నర్సరీలో సిద్ధంగా ఉన్న వివిధ రకాల మొక్కలు

అనుమతుల్లేని నర్సరీలు.. పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతుల అవసరాలను ఆసరాగా తీసుకొని నర్సరీ యజమానులు లాభాలు గడిస్తున్నారు. నర్సరీల ఏర్పాటుకు వ్యవసాయ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, ఆ దిశగా అనుమతులు పొందకుండా యథేచ్ఛగా నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఖాజీపేట, మైదుకూరు, వనిపెంట, జివి సత్రం తదితర ప్రాంతాల్లో నర్సరీలు అధికంగా ఏర్పాటయ్యాయి. కల్తీ విత్తనాలు, నాసిరకం నారు వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నర్సరీలపై తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు నర్సరీల వైపు కన్నెత్తి చూడడం లేదని రైతులు వాపోతున్నారు. అనుమతుల్లేని నర్సరీల లైసెన్సులను రద్దు చేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



యూరియా పంపిణీని పరిశీలిస్తున్న ఎఒ, ఉప సర్పంచ్ లక్ష్మీరెడ్డి

అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచుతాం

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతుల అవసరం మేరకు యూరియాను అందుబాటులో ఉంచుతామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయ అధికారిని నాగార్చన తెలిపారు. మండలంలోని రావులపల్లె రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా పుష్కలంగా ఉందన్నారు. యూరియా కొరత ఉందని వస్తున్న అసత్య ప్రచారాలను రైతులను నమ్మవద్దన్నారు. ప్రభు త్వం యూరియా పంపిణీపై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి లక్ష్మిరెడ్డి, సచివాలయ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఎఒ, రైతులు

యూరియా కొరత లేదు : ఎఒ

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలో సరిపడ యూరియా వచ్చిందని, కొరతలేదని ఎఒ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. కొందరు రైతులు యూరియా వస్తుందో, రాదోననే అపోహతో నిల్వ పెట్టుకుంటున్నారని తెలిపారు. మండలంలోని దాసరిపల్లెలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ సరిపడా వాడితే పోషకమని, అధికమైతే నష్టమని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో మండలంలో వరి, మొక్కజొన్న, పసుపు, ఉల్లి, మినుము, ఉద్యాన పంటలు రైతులు సాగు చేసి ఉన్నారన్నారు. దువ్వూరు మండలంలో ఖరీఫ్ సాగు మొత్తం 13,500 ఎకరాలు, ప్రస్తుతం యూరియా 985 టన్నులు మండలానికి సరఫరా చేసి ఉన్నారు. ఇందులో రైతు సేవా కేంద్రాల ద్వారా 336 మెట్రిక్ టన్నులు సరఫరా చేసి ఉన్నారని వివరించారు. అవసరం మేరకు రైతులకు కావలసిన యూరియా ఇంకా సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు జేరుష, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఎన్.తులసిరెడ్డి

అనాథ వృద్ధులకు సేవ మహాభాగ్యం

ప్రజాశక్తి - వేంపల్లె

అనాథలు, అనాథ వృద్ధులకు సేవ చేయడం మహాభాగ్యమని, అన్నదానం మహాదానమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానిక ప్రముఖ సంఘ సేవకుడు తోపురెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి మనవరాలు నిధిషా పుట్టినరోజు సందర్భంగా మంగళవారం స్థానిక నాగమ్మనగర్ కాలనీలోని మదర్‌థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధులు, అనాథ పిల్లల ఆశ్రమంలో అన్నదానం చేశారు. ముఖ్యఅతిథిగా తులసిరెడ్డి మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అని కొనియాడారు. కార్యక్రమంలో రవీంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులు సుజాత, పవన్‌కుమార్ రెడ్డి, లక్ష్మీదేవి, ప్రసాద్‌రెడ్డి, దేవి ప్రియాంక, నిత్యశ్రీ, దీపికా, శిరీషా, సతీష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సాంబశివారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - వేముల

వైసిపి మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. సాంబశివారెడ్డి నివాసం వద్ద భారీ కేక్ కట్ చేశారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు. స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మబ్బు చింతలపల్లి శివ శంకర్‌రెడ్డి, విశ్వేశ్వర్‌రెడ్డి, మరక శివకృష్ణారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, రాఘవరెడ్డి, మునీర్, ముస్కిన్ వల్లి, హరినాథ్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైసిపి శ్రేణుల మధ్య కేక్ కట్ చేస్తున్న నాగెళ్ల సాంబశివారెడ్డి

పైపులైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి - ముద్దనూరు



వర్షపు నీటి బొట్టును సైతం వృథా చేయకుండా నీరు ఒడిసి పట్టుకుని ఆదా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. మండల కేంద్రంలోని పాత వీధి సమీపంలో ఉన్న తాగునీటి పైపులైన్ పగిలి మూడు రోజుల నుంచి నీరు వృథాగా పారుతున్నాయి. రైల్వేగేటు వేస్తే వాహనదారులు, ప్రజలు బ్రిడ్జి కింద రాకపోకలు సాగిస్తుంటారు. నీరు రోడ్డుపై పారుతూ రైల్వే బ్రిడ్జి కింద నిలిచిపోవడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు పక్కనే మురుగుకాల్వ ఉండడంతో మురుగు నీరు కలసిపోయి ప్రవహిస్తున్నాయి. దుర్గంధం వెదజల్లుతూ తీవ్ర అవస్థలు పడుతున్నామని జెండామాను వీధి, పాతవీధిలోని ప్రజలు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆర్‌టిపిపి వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులు, రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు చేపట్టి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. తగు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ నరసింహులు తెలిపారు.

వ్యాపారులు సిండికేట్ అయితే చర్యలు తప్పవు

బయట ప్రాంత వ్యాపారులూ బత్తాయి వేలంలో పాల్గొనవచ్చు.. రైతుకు అన్ని విధాలా అండగా ఉంటాం : బిటెక్ రవి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల వ్యవసాయశాఖ మార్కెట్‌లో బత్తాయి పండ్లకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, వ్యాపారులు సిండికేట్ అయి వ్యాపారం చేస్తే సహించేదిలేదని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి రైతులకు హామీ ఇచ్చారు. ఆ మేరకు మంగళవారం ఆయన మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, మార్కెట్ యార్డ్ సిబ్బందితో కలిసి పరిశీలించారు. రెండు రోజులుగా పులివెందులలో చీనీ కాయల వ్యాపారస్తులు 12 మంది సిండికేట్‌గా ఏర్పడి టన్ను బయట ప్రాంతంలో రూ.20,000 ధర పలుకుతుండగా, పులివెందులలో రూ.9వేల నుంచి రూ.12 వేలకే కాయలను కొనుగోలు చేసి వ్యాపారులు ఇతర ప్రాంతాలకు టన్ను కాయలకు రూ.20వేల నుండి రూ.25 వేల వరకు విక్రయిస్తున్నారని రైతులు సోమవారం ఆందోళన చేశారని ఆయన పేర్కొన్నారు. బయట ప్రాంతాల నుండి వచ్చే వ్యాపారుల అందరికీ మార్కెట్ యార్డ్‌లో రూంలు ఇస్తామన్నారు. చిన్నకుప్ప, పెద్దకుప్ప అనే తేడా ఏమీ ఉండదు.. రైతులు ఆ అపోహ పెట్టుకోవద్దన్నారు. గ్రేడింగ్ విధానం అమలు చేస్తున్నామన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. పులివెందుల మార్కెట్‌ను తెచ్చింది వైసిపినే.. అయినా కూడా తాము దానిని కంటిన్యూ చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బీటెక్ రవి పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ వంగల శశిభూషణ్ రెడ్డి, సింహాద్రి పురం మాజీ జడ్పీటిసి పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పులివెందుల, సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్లు రామసురారెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్కెట్ యార్డ్‌లో రైతులతో బీటెక్ రవి, నాయకులు

మహా గురుకుల పాఠశాలలో సమస్యలు తిష్ట



వంటశాలను పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

తోట్లపల్లి సమీపంలో ఉన్న అంబేద్కర్ మహా గురుకుల పాఠశాలను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక అనారోగ్యానికి గురవుతున్నారు. విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించడంలో జిల్లా అధికారులు స్థానిక అధికార ప్రతినిధులు విఫలమయ్యారు. వెంటనే గురుకుల పాఠశాల సమస్యల పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల, మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులు అరవింద్, రాజశేఖర్ మాట్లాడుతూ మహా గురుకుల పాఠశాలలో 700మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వీరికి భోజనశాలలో సరైన మౌలిక సదుపాయాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. భోజనంలో నాణ్యతలేదని, విద్యార్థులు తినలేక దానిని చెత్త డ్రమ్ములో వేసే పరిస్థితి కనపడుతోందన్నారు. మరోవైపు మురికి కాలువ భోజనం చేసే దగ్గరే ఉండడం దారుణమన్నారు. భోజనశాల శుభ్రం చెయ్యకపోవడం వర్కర్ల నిర్లక్ష్యంగా కనబడుతోందన్నారు. ఉన్నతాధికారులు వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.. ఇంతవరకు నెరవేరలేదన్నారు. గురుకుల పాఠశాలను జిల్లా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చాలాసార్లు సందర్శించారన్నారు. సమస్యలు పరిష్కరించకపోవడం చాలా దారుణమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రదీప్, చైతన్యలు పాల్గొన్నారు.

దయనీయంగా ధాన్యం ధరలు

ప్రజాశక్తి - చాపాడు



సిద్ధారెడ్డిపల్లిలో అమ్మిన వరి ధాన్యాన్ని లారీలోకి చేర్చుతున్న రైతులు

గత ఖరీఫ్‌లో సాగు చేసిన వరి ధాన్యం ధరలు దయనీయంగా ఉన్నాయి. డిసెంబర్ నెలలో వరి నూర్పిడి పనులు చేపట్టిన సమయంలో పుట్టి(8 బస్తాల) ధర రూ.12 వేల వరకు పలికాయి. ఆ తర్వాత జనవరి నుంచి రూ.13 వేలకు చేరుకున్నాయి. ఇప్పటివరకు ఆవే ధరలు కొన సాగుతూ స్థిరంగా ఉన్నాయి. మండల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా కేసీ కెనాల్, కుందూ, పెన్నా, మైలవరం, తెలుగుగంగ డ్యాంల పరిధిలో 1,50,000 ఎకరాలకు పైగా వరి పంటను రైతులు సాగు చేపట్టారు. వరి పంట దిగుబడి కూడా ఆశాజనకంగా ఉంది. ఎకరాకు 27 నుంచి 32 బస్తాల వరకూ మాత్రమే దిగుబడి వచ్చింది. ఎకరాకు రూ.30 వేల వరకు సాగు ఖర్చులు అయ్యాయని రైతులు పేర్కొం టున్నారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధరలు నామమాత్రంగా ఉండడంతో సాగు ఖర్చులు కూడా రాని పరిస్థితి. ధాన్యం నిలువ ఉంచితే ధరలు పెరుగు తాయని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. గతంలో ఆగస్టు, సెప్టెంబర్ నాటికి వరి ధాన్యం ధర రూ.18వేల వరకు పలికేవి. ఈ ఏడాది రూ.14వేలు మాత్రమే పలుకుతుండడంతో వరి సాగు చేసిన రైతులకు ఏమాత్రం గిట్టుబాటు ధర లేదని పేర్కొంటున్నారు. వరి ధాన్యాన్ని నిల్వ ఉంచి తీవ్రంగా నష్టపోతున్నామని కొంతమంది రైతులు అమ్మకాలకు సిద్ధపడుతున్నారు.

వరి సాగు చేసి నష్టపోయాం..



గత ఖరీఫ్‌లో వరి సాగు చేసి నష్టాలపాలయ్యాం. దిగుబడి మాత్రం ఎకరాకు 28 బస్తాలు ప్రకారం వచ్చింది. 10 ఎకరాలు సాగు చేపట్టాను. నూర్పిడి సమయంలో పుట్టి రూ.13,500 వరకు ధర పలికాయి. ధరలు పెరుగుతాయని ఆశించి నిల్వ ఉంచినప్పటికీ ధరలు పెరగలేదు. ప్రభుత్వం ధరల స్థిరీకరణ చేపట్టాలి.

- దస్తగిరి, గుంతచియ్యపాడు, చాపాడు



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

చక్రాయపేట :జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తిమ్మారెడ్డిగారిపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుక్కా భాస్కర్‌రెడ్డి, మహాదేవపల్లె జడ్‌పి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు అరికల ఎరికలరెడ్డి, చిలేకంపల్లె జడ్‌పి ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు పి.శ్రీదీపను మంగళవారం ఘనంగా సన్మానించారు. చిలేకాంపల్లె జడ్‌పి ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామ ప్రజల సమక్షంలో సన్మానసభ ఏర్పాటు చేశారు. ఆ పాఠశాల హెచ్‌ఎం వై.గంగాదేవి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు వేల్పుల రామాంజనేయ ప్రసాద్, ఎస్‌టియు రాష్ట్ర మీడియా కన్వీనర్ శివారెడ్డి, నాగలగుట్టుపల్లె పిహెచ్‌సి స్కూల్ హెచ్‌ఎం ధర్మారెడ్డి, చిలేకంపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ద్వారకనాథ్‌రెడ్డి, నరసింహులు, స్కూల్ కమిటీ చైర్మన్ లక్ష్మీదేవి, ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు- ప్రొద్దుటూరు ప్రధాన రహదారిపై ఆనందా ఆశ్రమం రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమాపురం గ్రామానికి చెందిన లెక్కల లక్ష్మిరెడ్డి (60) మృతిచెందాడు. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. మృతుడు మైదుకూరు నుంచి గ్రామానికి టివిఎస్ ఎక్స్‌ఎల్ ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై నుంచి ప్రొద్దుటూరుకు వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ సంఘటనలో మృతినికి తల పూర్తిగా దెబ్బ తినడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - కమలాపురం టౌన్

కమలాపురం డివిజన్ పరిధిలో యూరియా కొరతలేదని వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ పపరిధిలోని కమలాపురం, వల్లూరు, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మండలాల్లో సుమారు 4,438 హెక్టార్లలో రైతులు పంటలు సాగుచేశారని, ఇందులో 1650 హెక్టార్లు వరి సాగు చేశారని చెప్పారు. సాగు చేసిన పంటలకు 500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే ఇప్పటికే ప్రయివేట్ డీలర్ల ద్వారా172, రైతు సేవా కేంద్రాల ద్వారా 782, మన గ్రోమోర్ కేంద్రాల ద్వారా 100 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించామన్నారు. ప్రస్తుతం చిన్నచెప్పలి, సంబటూరు కేంద్రాల్లో 20 మెట్రిక్ టన్నుల డిఎపి అందుబాటులో ఉందని త్వరలో అన్ని కేంద్రాల్లో సరపరా చేస్తామని చెప్పారు. అవసరమైన రైతులు వినియోగించుకోవాలని కోరారు. కమలాపురం మార్కెట్ యార్డులో క్వింటా ఉల్లికి రూ.1200 మద్దతు ధర కల్పిస్తూ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశామని రైతులు వినియోగించుకోవాలన్నారు.

22 మంది పేకాట రాయుళ్లు అరెస్టు

రూ.11 లక్షల నగదు, 15 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గండికోట - దపెర్ల రోడ్డు సమీపంలోని చెట్ల పొదలలో పేకాట ఆడుతున్న వివిధ ప్రాంతాలకు చెందిన 22 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ 11,83,940 నగదు, 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని అర్బన్ సిఐ నరేష్ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ చిటిమిటిచింతల గ్రామ సమీపంలో గండికోట-దపెర్ల వద్దనున్న చెట్ల పొదల్లో పేకాట ఆడేందుకు సిద్ధం చేసుకున్నారు. ఇందులో భాగంగా ఉదయం 11:30 గంటల సమయంలో పార్టీ చేసుకోవాలనే ఉద్దేశంతో అవుకు నుండి గుర్తు తెలియని వ్యక్తుల నుంచి సారాయి తెచ్చుకుని పేకాట ఆడుతున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. వారిని అరెస్ట్ చేసి వారి వద్ద నుండి సారా, నగదును స్వాధీనం చేసుకున్నామని వారిని రిమాండ్‌కు తరలించామని సిఐ నరేష్‌కుమార్ పేర్కొన్నారు.



అబార్షన్లపై ఆడిట్ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గర్భస్రావాల విషయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

గర్భస్రావాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ వి.మల్లేష్ సూచించారు. మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం బద్వేలు డివిజన్ పరిధిలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించి మల్లేష్ ఆధ్వర్యంలో గత నెలలో జరిగిన పిసిపి ఎన్‌డిటి అబార్షన్లపై ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్రావాల విషయంలో సరైన నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రికార్డుల నిర్వహణ, అబార్షన్ల ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ వి.సుధా, ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.రాఘవయ్య, సూపర్వైజర్లు కె.వీరాంజనేయులు, డి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుండి ప్రతి నెల 9న మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ ఆదేశాల మేరకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు. ప్రభుత్వ వైద్యాధికారి సంపత్‌కుమార్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు బ్రహ్మంగారి ఆలయం నుండి భోజన సదుపాయం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృషభాచలేశ్వర స్వామి దేవస్థానం పాలక మండలి నియామకం

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని వృషభాచలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన పాలకమండలి సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఆ మేరకు 11 మంది పాలకమండలి సభ్యులు నియమిస్తూ దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పాలకమండలి సభ్యులుగా పాలెగాలే వెంకటరమణ, మారుతి ప్రసన్న, రామయ్య, నాగిశెట్టి సునీల్‌కుమార్, పెద్ద రామాంజనేయులు, తప్పెట వరాలు, దాసరి రవణమ్మ, జూటూరు జ్యోతి, కొమ్మేది వెంకటసుబ్బమ్మ, కొనేటి రాజమ్మ, హరి ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. చైర్మన్‌గా వెంకటరమణను ఇప్పుటికే పులివెందుల టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఖరారు చేశారు. ఈ నెలాఖరుకు పాలక మండలి ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిసింది.

వేంపల్లె షరీఫ్‌కు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెకు చెందిన కథా రచ`యిత, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పుర స్కార గ్రహీత డాక్టర్ వేంపల్లె షరీఫ్‌కు ఈ ఏడాది కథానిక విభాగంలో తెలుగు యూని వర్సిటీ కీర్తి పురస్కారం ప్రకటించింది. ఇటీవలే ఆయన 'చారల పిల్లి' పేరుతో తన మూడవ కథా సంకలనాన్ని వెలువరించారు. అంతకుమునుపు ఆయన రాసిన 'జుమ్మా', 'టోపీ జబ్బార్' తరహాలోనే 'చారలపిల్లి' కథా సంకలనం కూడా పాఠకుల ఆదరణ పొందింది. షరీఫ్ రాసిన కథలు వివిధ భారతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. కొన్ని నాటకంగా ప్రదర్శితమయ్యాయి. మరికొన్ని ప్రతిష్టాత్మక జాతీయ కథా సంకలనాల్లో చోటు సంపాదించాయి. ఆయన రాసిన 'ఆకుపచ్చముగ్గు' కథ డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపికైంది. జర్నలిజంలో పిహెచ్‌డి చేసి ఆయన వెలువరించిన పరిశోధన పుస్తకం 'టీవీ ప్రకటనలు' వివిధ యూనివర్సిటీల్లో ఎంబిఎ విద్యార్థులకు రిఫరెన్స్ పుస్తకం కింద ఉంది. షరీఫ్ కథా సాహిత్యం మీద పలు యూనివర్సిటీల్లో పిహెచ్‌డి, ఎంఫిల్ పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో షరీఫ్ గత పాతికేళ్లుగా కథానికా విభాగంలో విశేష కృషి చేసినందుకు తెలుగు యూనివర్సిటీ ఈ పురస్కారం ప్రకటించింది. ఈనెల 23, 24 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో రచయితకు రూ.5,116 నగదుతోపాటు పురస్కార ప్రదానం చేస్తున్నట్లు యూనివర్సిటీ విసి నిత్యానందరావు ఒక ప్రకటనలో తెలిపారు.



సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ బాలాజీ పాఠశాలదే అగ్రస్థానం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా బాలాజీ హైస్కూల్‌దే అగ్రస్థానమని ఆ పాఠశాల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి తెలిపారు. సోచ్ ఫౌండేషన్‌కు బాలాజీ హైస్కూల్ డైరెక్టర్ విద్యార్థుల సహకారంతో మంగళవారం రూ.1,40,102 నగదు వితరణ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రవీంద్రా రెడ్డి మాట్లాడుతూ సోచ్ ఫౌండేషన్‌లోని దివ్యాంగులు వారిలో ఉన్న ప్రతిభను చూపించి తర్వాత వారికి సహకారం చేయమని అడగడం అభినందించదగ్గ విషయమన్నారు. అంగవైకల్యాన్ని సైతం ఎదిరించి విద్యార్థులకు స్ఫూర్తినిచ్చేలా వారి సందేశం, వారి గీతాలాపన ఉందన్నారు. ఇలాంటి వారికి తమ పాఠశాల ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. గతంలో రాగసుధా ఫౌండేషన్ వారికి రూ.1,15,000 వరకు ఇచ్చామన్నారు. జమ్మలమడుగు పట్టణంలోని మే ఐ హెల్ప్ ఫౌండేషన్‌కు మా వంతు సహకారం అందిస్తూనే ఉన్నామన్నారు. దేశ బార్డర్ లో ఉన్న సైనికులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపుమేరకు రూ.లక్షకు పైగా వితరణ చేశామన్నారు. గత సంవత్సరం అమరావతి వరద బాధితులకు అండగా ఆర్థికసాయం చేశామన్నారు. సోచ్ ప్రతినిధి హరి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలో ఉన్న అన్ని ప్రయివేట్ పాఠశాలలో కెల్లా అత్యధికంగా ఎక్కువ నగదు వితరణ చేసిన హైస్కూల్‌గా బాలాజీ హైస్కూల్ ఉందన్నారు. ఎక్కువ నగదు కలెక్ట్ చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్, మెమెంటో, మెడల్ ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ పరిపాలన అధికారి కెవివి ప్రసాద్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు ఖాసిం, రిషికేశవాచారి, సత్యా నందం, వెంకటప్రసాద్, మహబూబ్ బాషా, అబ్దుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సోచ్ ప్రతినిధికి నగదు అందజేస్తున్న డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి

క్రైం కార్నర్

పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ గ్రామానికి చెందిన కదిరేపల్లె విష్ణువర్ధన్ అనే యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నిందితుడు బద్రిపల్లి గ్రామానికి చెందిన ఒక యువతితో ఫోన్‌లో మాట్లాడేవాడన్నారు. ఈనెల 7వ తేదీ తెల్లవారుజామున 2.30 సమయంలో అమ్మాయి ఇంటి వద్దకు వెళ్లి బయటికి వెళ్లి మాట్లాడాలని బలవంతం చేశాడన్నారు. యువతి చేయి పట్టుకొని లాగాడన్నారు. బాధితురాలు విషయాన్ని తండ్రికి తెలపడంతో ఆయన ఇంటి బయటకు వెళ్లి చూడగా నిందితుడు పరారయ్యాడన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.